


జగన్ మార్కు నిర్లక్ష్యం



కడప నగర శివార్లలోని లక్ష్మీనగర్‌లో పూర్తయిన టిడ్కో ఇళ్లు

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ బహిరంగసభల్లో నా పేదలు నా పేదలు అంటూ ఎనలేని ప్రేమను ఒలకబోస్తారు. పేదలకు, పెత్తందారులకు యుద్ధమంటూ ఉత్తుత్తి మాటలు చెబుతారు. తాను లేకపోతే పేదలు ఎలా బతుకుతారని తనకు తానుగా పేదల పెన్నిధిగా చెప్పుకుంటారు. అయితే మాటల్లో తప్ప చేతల్లో పేదలపై ప్రేమ లేదనేది అర్థమవుతోంది. ఎందుకంటే పేద, మధ్యతరగతి కుటుంబాల కోసం చంద్రబాబు నిర్మించిన టిడ్కో ఇళ్లపై తన మార్కు నిర్లక్ష్యాన్ని చూపించారు. ఇళ్లు పూర్తయి ఐదేళ్లయినా ఇంత వరకు లబ్ధిదారులకు అందని దౌర్భాగ్య పరిస్థితి. ఐదేళ్లు అయినా లబ్ధిదారులకు అందకపోవడంతో పేదలు అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాంతమంతా చెట్లు చేమలు పిచ్చిమొక్కలుతో నిండిపోగా.. ఇదే అదనుగా కొందరు ఖాళీస్థలాలను ఆక్రమించుకుంటున్నారు. కేవలం నిర్లక్ష్యం, చంద్రబాబుపై రాజకీయ కక్షతోనే ఆ ఇళ్లను పేదలకు పంచడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఇంకా ఎన్నేళ్లు..?

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు చంద్రబాబు నాయుడు హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థలం ఉన్న వారికి పక్కాగృహాలు మంజూరు చేస్తూ వచ్చారు. పట్టణాల్లో స్థలం కొరత ఉండడంతో షేర్‌వాల్ టెక్నాలజీతో అపార్ట్‌మెంట్ల నిర్మాణం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, బద్వేలులో ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టారు. జీప్లస్-3 తరహాలో సింగిల్‌బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలు చేపట్టారు. అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్న వారికి టిడ్కో ఇళ్లు మంచి అవకాశంగా కనిపించింది. ఇక సొంతింటి కల నెరవేర్చుకునేందుకు వారి స్థోమత బట్టి సింగిల్, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎంచుకున్నారు.

నిర్మాణాలు పూర్తి

మొదటి విడతలో కడప నగర శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద లక్ష్మినగర్‌లో 992, జమ్మలమడుగు వద్ద 1440 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2018 డిసెంబరు నాటికే ఈ రెండుచోట్ల ఇళ్ల నిర్మాణం 80 శాతం పూర్తయింది. జమ్మలమడుగులో 1440 ఇళ్లకు గాను 1404 ఇళ్లు పూర్తయ్యాయి. అక్కడ కేవలం 36 ఇళ్లు మాత్రమే పెండింగు ఉన్నాయి. కడపలో అయితే అన్ని ఇళ్లు పూర్తయ్యాయి. 2019 జనవరి నాటికే ఈ రెండు చోట్ల దాదాపు 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. కేవలం డ్రైనేజీ, రోడ్లు, ఎలక్ట్రిసిటీ ఇలా మౌలిక వసతుల పనులు మాత్రమే చేపట్టాల్సి ఉంది. అప్పట్లో ఎన్నికలు రావడంతో జగన్ సీఎం అయ్యారు.

చంద్రబాబుపై కక్షతో

టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తే ఆ ఇళ్లన్నీ చంద్రబాబునాయుడు కట్టినవి కావడంతో ఆయనకు పేరు వస్తుందని.. చలమారెడ్డిపల్లె వద్ద 1442 ఇళ్లు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, బద్వేలులో చేపట్టి వివిధ దశల్లో ఉన్న పనులు నిలిపివేశారు. కడప లక్ష్మీపురం, జమ్మలమడుగులో మాత్రం 90 శాతం పూర్తి కావడంతో వీటిని కొనసాగించాలనుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్లపై స్పందన లేకపోవడంతో టీడీపీ, కమ్యూనిస్టులు, ఇతర పార్టీలన్నీ పోరుబాట పట్టాయి. టిడ్కో ఇళ్ల వద్ద ఆందోళన చేశారు. ఇవాళ రేపు ఇస్తామంటూ తేదీలు ప్రకటించారు. అయితే ఒక్కరికీ ఇవ్వలేదు. కడప నగర శివార్లలో టిడ్కో ఇళ్లను సోమవారం సాయంత్రం ఆంధ్రజ్యోతి వెళ్లి పరిశీలిస్తే.. ఆ ప్రాంతం చెట్లతో నిండిపోయింది. ఇంకా రోడ్లు పూర్తి కాలేదు. డ్రైనేజీ నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఈ టిడ్కో ఇళ్ల చుట్టూ పెద్ద ఎత్తున నివాసాలు వెలిశాయి. నాలుగేళ్ల కిందటనే ఇళ్లు ఇచ్చి ఉంటే ఇప్పుడు ఆ ప్రాంతం జనంతో కళకళలాడుతుండేది. ఇళ్లు పూర్తయినా పెయింటు వెలిసిపోయింది. కిటికీలు దెబ్బతింటున్నాయి. అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి.

జమ్మలమడుగులో 1440 ఇళ్లకు గాను 1404 ఇళ్లు పూర్తయ్యాయి. ఇక్కడ చంద్రబాబు హయాంలో జరిగిన పనులు తప్ప ఇప్పటికి ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇక్కడ ప్రార్థనామందిరాలు, పాఠశాల పార్కు, ఇతర ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఖాళీ స్థలాలు కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కడప, జమ్మలమడుగులో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చి ఉండింటే అవన్నీ జనసందోహంతో కళకళలాడేవి. పేదలకు సొంతింటి కల నెరవేరేది. అయితే కేవలం జగన్ మార్కు నిర్లక్ష్యం వల్ల ఇళ్లు అందక పేదలు అద్దె ఇళ్లల్లో మగ్గుతున్నారు.

పెండ్లిమర్రి కానిస్టేబుల్ సస్పెన్షన్

● కారు అద్దెకు తీసుకుని మరొకరి వద్ద తాకట్టు పెట్టిన ఫలితం

కడప (క్రైం), ఏప్రిల్ 8: సొంత ప్రయోజనానికి కారు అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టి యజమానిని మోసం చేసిన వ్యవహారంలో పెండ్లిమర్రి పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ వై.రామయ్య (పీసీ 856)ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఉత్తర్వులు జారీ చేశారు. పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రామయ్య బద్వేలుకు చెందిన యజమాని వద్ద టయోటా ఇతియోస్ కారు అద్దెకు తీసుకున్నాడు. ఆ కారును తిరిగి అప్పగించకుండా ఈ రోజు రేపు ఇస్తానంటూ చెబుతూ వచ్చాడు. దీనిపై అనుమానం వచ్చిన కారు యజమాని బద్వేలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో కానిస్టేబుల్ అద్దెకు తీసుకున్న కారును మరొకరి వద్ద తాకట్టు పెట్టినట్లు తేలింది. దీనిని ఎస్పీ తీవ్రంగా పరిగణించారు.

తక్షణం సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల్లో పోలీసు శాఖ ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరించిన కానిస్టేబుల్‌పై క్రమశిక్షణ చర్యలతో పాటు కారు యజమాని ఫిర్యాదుపై బద్వేలు పోలీసుస్టేషన్‌లో క్రైం నెం.134/2024గా కేసు నమోదు చేసి విచారణకు ఆదేశించారు.

నాలుగేళ్ల బాలుడిని కొట్టి చంపిన తండ్రి


మృతి చెందిన ముస్తఖీమ్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 8: తండ్రి విచక్షణా రహితంగా కొట్టడంతో నాలుగేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన సోమవారం ఉదయం ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఆర్ట్సుకాలేజీ రోడ్డులోని కాల్వకట్టకు చెందిన ఇమ్రాన్ అలీకి రబీనా అనే కుమార్తెతో పాటు కొడుకు ముస్తఖీమ్ (4) ఉన్నాడు. కుమారుడు పుట్టిన నాలుగు రోజులకే భార్య అనారోగ్యంతో మృతిచెందడంతో అతను ఏడాదిన్నర క్రితం రెండోపెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి కొడుకును విపరీతంగా కొట్టేవాడు. రెండునెలల క్రితం ఇమ్రాన్‌అలీ కొట్టడంతో ముస్తఖీమ్ చేయి విరిగింది. అయినా బాలుడికి చికిత్స చేయించలేదు. ఈ విషయం తెలిసి అమ్మమ్మ మస్తాన్‌బీ వచ్చి బాలుడిని తీసుకెళతానన్నా ఇమ్రాన్‌అలీ ఒప్పుకోలేదు. కాగా.. ఆదివారం రాత్రి నుంచి కొడుకును విపరీతంగా కొట్టాడు. దీంతో బాలుడు చనిపోయాడు. దీనిని సాధారణ మృతిగా చిత్రీకరించి ముస్తఖీమ్ మృతదేహాన్ని సోమవారం ఉదయం ఖననం చేయాలని ఏర్పాట్లు చేసుకున్నాడు. మనవడు చనిపోయిన విషయం అమ్మమ్మకు బంధువులు ఫోన్ చేసి చెప్పారు. ఆమె వెంటనే ప్రొద్దుటూరు చేరుకున్నారు. ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ వారిపై ఇమ్రాన్‌అలీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో అనుమానం వచ్చిన మస్తాన్‌బీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన మనవడిని తండ్రి కొట్టి చంపాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీకాంత్ తెలిపారు.



ఇచ్చిన మాట కోసం ప్రాణత్యాగమైనా చేయాలి

- అదీ వైఎస్సార్ బిడ్డంటే
- వాగ్దానాలన్నీ మద్యం షాపుల్లో పెట్టాడు
- హంతకునికి ఓట్లేస్తే మిమ్మల్ని చరిత్ర క్షమించదు
- అసలు జగన్‌కు ఎందుకు ఓటెయ్యాలో చెప్పండి
- బస్సుయాత్రలో షర్మిల ఘాటు వ్యాఖ్యలు


దువ్వూరులో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల, చిత్రంలో డాక్టర్ సునీత

మైదుకూరు, ఏప్రిల్ 8: "మాట ఇస్తే దాని కోసం ప్రాణ త్యాగమైనా చేయాలి.. అదీ వైఎస్సార్ బిడ్డంటే.. మీ జగనన్నకు ఎందుకు ఓట్లేయాలో చెప్పమనండి.. అక్రమ ఆదాయం కేసులో జగన్‌ను అరెస్టు చేస్తే.. నేను పార్టీని భుజాలపై వేసు కుని 3వేల కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి గటెక్కించా... అధికారం వచ్చినాక ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఆ పేర్లతో మద్యం తయారు చేపించి మద్యం షాపుల్లో పెట్టాడు. సొంత చిన్నాన్నను గొడ్డలితో దారుణంగా హత్య చేస్తే సీబీఐ పేర్కొన్న వ్యక్తులను రక్షించడంతో పాటు వారిని ఎంపీగా నిలబెట్టారు. ఆ హం తకునికి, జగన్‌కు ఓట్లేస్తే చరిత్ర మిమ్మల్ని క్షమించదు" అని పీసీసీ అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. ఆమె న్యాయయాత్ర పేరిట చేపట్టిన బస్సుయాత్ర సోమవారం మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు, బ్రహ్మం గారి మఠం, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండల కేంద్రాల్లో జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ జగన్ చేపట్టిన పాదయాత్ర అర్ధంతరంగా ఆగిపోతే తానే కొనసాగించి పార్టీకి ఊపిరిపోశానన్నారు. అసలు జగన్‌కు ఎందుకు ఓట్లేయాలో చెప్పాలన్నారు. రైతన్నల కోసం 4వేల కోట్లతో ధర స్థిరీకరణ నిధి, నిరుద్యోగుల కోసం మెగా డీయస్సీ, పూర్తి మద్యపాన నిషేదం అంటూ అనేక హామీలు ఇచ్చారన్నారు. రైతులకు సంబంధించిన ఏ ఒక్క పథకానికి సబ్సిడీలు లేవన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఫీజు రియింబర్స్‌మెంట్ పెడితే ఈ జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎత్తేశారన్నారు. అధికారం చేపట్టిన తరువాత కుంభకర్ణుడిలా నిద్రపోయి.. ఆరు నెలల క్రితమే లేచి ఓట్లెయ్యండి అంటూ బజారు వెంట పడ్డాడన్నారు. లోక్ సభ అభ్యర్థులను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని పిల్లిలా ఉండిపోయాడే ఇదా వైయస్సార్ బిడ్డంటే అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో సొంత చిన్నాన్నను గొడ్డలితో ఘోరంగా హత్య చేస్తే, సీబీఐ విచారణలో ఫలాన వాళ్లు నిందితులంటే.. వారిని అప్పగించక పోగా వారిని రక్షిస్తు వస్తున్నాడని, ఇప్పుడు అవినాశ్‌రెడ్డికే ఎంపీ టికెట్ ఇచ్చాడని, ఇది ఎంత వరకు సబబో ఏదీ న్యాయమో, ఏదీ ధర్మమో మీరే నిర్ణయించాలన్నారు. జగన్‌కు గాని అవినాశ్‌కు గాని ఓట్లేస్తే చరిత్ర మిమ్మల్ని క్షమించదన్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి ప్రజాదర్బార్ పేరుతో ఎల్లప్పుడు ప్రజల చెంత ఉంటే.. ఈ జగన్ కనీసం మంత్రులకు, ఎమ్మెల్యేలకు కూడా అందుబాటులో లేడన్నారు. అధికారం చేపట్టిన తరువాత పాలన అంతా అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, హత్యలు, ఇసుక మాఫియాతో సరిపెట్టాడన్నారు.

సీబీఐ ఆధారాలతోనే మాట్లాడుతున్నా..

అయ్యా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గారు.. వివేకానందరెడ్డిని గొడ్డలితో ఘోరంగా నరికి హత్య చేసిన సంఘటనలో అన్ని సాక్ష్యాలతో సీబీఐ చార్జిషీటు వేసింది.. ఆ ఆధారాలతోనే మాట్లాడుతున్నా.. వారందరికి సీఎం జగన్ అండగా నిలబడలేదా.. మళ్లీ ఎంపీ టికెట్ ఇవ్వలేదా.. ఇది నిజం కాదా తెలుసుకొని మాట్లాడండి అంటూ హితవు పలికారు. వివేకా కుమార్తె డాక్టర్ సునీత మాట్లాడుతూ.. వివేకానందరెడ్డిని హత్యచేసి తమను రోడ్లపాలు చేశారన్నా రు. హంతకులకు ఓట్లు వేయొద్దని విజ్ఞ ప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పాల్గొన్నారు. కాగా.. ఉగాది, రంజాన్ పండుగల సంద ర్భంగా షర్మిల బస్సుయాత్రకు మూడు రోజులు విరామం ప్రకటించారు.

"పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి కడప నియోజకవర్గాన్ని దశాబ్దాలు వెనక్కి నెట్టిన వారు ఇంకా ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారు. ఈ ఎన్నికలు అధికార దర్పానికి, కడప ప్రజల ఆత్మ గౌరవానికి మధ్య పోటీ. అంజద్‌బాషాను వరుసగా రెండుసార్లు గెలిపించి మోసపోయాం. ఇప్పుడు మరోసారి మోసపోకుండా జాగ్రత్త పడదాం" అని కడప అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. ఇసుక, మట్టి, భూకబ్జాలు, బెదిరింపులతో చెలరేగిపోతున్న డిప్యూటీ సీఎం, ఆయన తమ్ముడిని జిల్లా నుంచే కాక రాష్ట్ర బహిష్కరణ చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.

పదేళ్లు ఎమ్మెల్యేగా ఏం చేశారు?

- బుగ్గవంకపై బ్రిడ్జిలు నిర్మించారా?
- ముస్లిం మైనారిటీలను ఆదుకున్నారా?
- ప్రజా రవాణా వ్యవస్థ మెరుగు పరిచారా?
- భూ ఆక్రమణలు అడ్డుకున్నారా..?
- టిడ్కో ఇళ్లకు రంగులేశారే కానీ.. లబ్ధిదారులకు ఇచ్చారా..?
- డిప్యూటీ సీఎంకు కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి సూటి ప్రశ్నలు
- రెండుసార్లు గెలిపించి మోసపోయాం
- మరోసారి కాకుండా జాగ్రత్తపడదామని పిలుపు
- అధికారంలోకి రాగానే సిట్ వేసి..
- ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటాం
- కడప ఎమ్మెల్యేపై చార్జిషీట్ విడుదల



కడప ఎమ్మెల్యే పదేళ్ల పాలనపై చార్జిషీట్ విడుదల చేసి మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవిరెడ్డి


కడప ఎమ్మెల్యే పదేళ్ల పాలనపై చార్జిషీట్ విడుదల చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రతినిధులు

కడప(ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8: ప్రజల ఆకాంక్షకు విరుద్ధంగా రాష్ట్రంలో వైసీపీ పాలన కొనసాగిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. ఏ పథకం చూసినా అవినీతి, అన్యాయమే తాండవిస్తోందన్నారు. రాష్ట్రంలోనే కాదు.. కడప నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న అంజద్‌బాషా కడప నియోజకవర్గంలో కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. సోమవారం కడప నగరం ద్వారకానగర్‌లోని ఆర్.శ్రీనివాసరెడ్డి నివాసంలో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి కడప నియోజకవర్గ ప్రజలను వంచనకు గురిచేసిన స్థానిక ఎమ్మెల్యేపై ఆర్.మాధవీరెడ్డి చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇసుక, మట్టి, భూకబ్జాలు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఆయన తమ్ముడు అహ్మద్‌బాషాతో ప్రజలను బెదిరించే విధంగా తర్ఫీదు ఇచ్చారన్నారు. ఇటువంటి వ్యక్తులను జిల్లా నుంచే కాక రాష్ట్ర బహిష్కరణ చేయాలన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కంబాలదిన్నెలో ఉక్కుపరిశ్రమకు భూమిపూజ చేస్తే.. అధికారంలోకి వచ్చిన జగన్ ఉక్కు పరిశ్రమకు రెండుసార్లు భూమిపూజ చేసి పనులు మాత్రం చేయలేదన్నారు. షుగరు ఫ్యాక్టరీ, పాలశీతలీకరణ పరిశ్రమ, నందలూరు ఆల్విన్ పరిశ్రమలు తెరిపించారా అని ప్రశ్నించారు. పాతకడప చెరువును ట్యాంక్‌బండ్ చేస్తామని రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. పెట్టుబడులు రావాలన్నా పరిశ్రమలు నెలకొల్పాలన్నా అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ 2019లో జగన్మోహన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్‌కు శిలాఫలకం వేసి నిరుద్యోగుల్లో ఉద్యోగాలు వస్తాయన్న ఆశలు రేకెత్తించారన్నారు. అయితే స్టీల్‌ప్లాంట్ పూర్తిచేయక నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడ్డారు.

ఆస్తులు పెంచుకోవడం తప్ప జనానికి ఏం చేశారు?

● డిప్యూటీ సీఎంను ప్రశ్నించిన మాధవీరెడ్డి

కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి ప్రజల సంక్షేమం విస్మరించారని.. ఆయన ఆస్తులు బంధువులు, అనుచరుల ఆస్తులు పెంచుకోవడానికి తప్ప నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఏమీ చేయలేదన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించారా అని ప్రశ్నించారు. జనావాసాల్లో మురుగునీరు చేరుతున్నా పట్టించుకోలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్మించి నాలుగేళ్లవుతున్నా వాటికి రంగులు మార్చారే కానీ లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ గ్రౌండ్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని బీరాలు పలికి ఎక్కడా ఆ మేరకు చర్యలు తీసుకోలేదన్నారు. కొత్త పార్కులకు రూపకల్పన చేయలేదని, ఉన్న పార్కులు అశ్రద్ధ చేశారని అన్నారు. కడప నగరం మధ్యలో పారుతున్న బుగ్గవంక వాగును వంద కోట్లతో సుందరంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీని వైసీపీ ప్రభుత్వం మరిచిందన్నారు. వాగు పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన డ్రైనేజీ సమస్య ఉన్నా... ఆ చుట్టూ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పట్టించుకోలేదన్నారు.

కడప ప్రజలకు శాంతి లేకుండా చేశారు

కడప నగరంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యుల అరాచకాలకు అడ్డు అదుపు లేదన్నారు. భూకబ్జాలు బెదిరింపులు, హత్యలు, దందాలు లీగల్ చేశారని ఆరోపించారు. మహిళలకు కనీస గౌరవం ఇవ్వకుండా సోషల్ మీడియాలో జుగుప్సాకరమైన కామెంట్లు, ట్రోల్స్ చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల అండతో వారి అనుచరులు అసాంఘిక, అవినీతి అరాచక కార్యక్రమాలతో కడప ప్రజలకు శాంతి లేకుండా చేశారని తెలిపారు.

ప్రభుత్వ భూముల కబ్జా

వెంచర్ల ముసుగులో ప్రభుత్వ భూములు వదలడంలేదని.. కడపలో దాదాపు 400 వరకు అనధికార లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారంటే ఏ విధంగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారో అర్థమవుతుందన్నారు. సీకేదిన్నె ఏరియాలో మూలవంక వద్ద 52 ఎకరాల ప్రభుత్వ స్థలంలో వెంచర్ వేసి విక్రయించారన్నారు. అక్రమ కట్టడాలు అని కొన్ని ఏరియాల్లో పేదల ఇళ్లు కూల్చారని.. కానీ వైసీపీలోని నాయకులవి అక్రమ కట్టడాలైనా వాటివంక కన్నెత్తి కూడా చూడలేదని తెలిపారు.

జగనన్న కాలనీ పేరుతో వాటాలు..

జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్లపట్టాలు ఇస్తామని చెప్పి కోట్ల రూపాయలు పెట్టి భూములు కొని.. వాటిలో వాటా కొట్టేశారని మాధవీరెడ్డి ఆరోపించారు. జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తామని హామీఇచ్చి ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా ఆ హామీ నెరవేర్చలేకపోయారన్నారు.

శంకుస్థాపనలు తప్ప పనులేవీ..?

రిమ్స్ ఆసుపత్రితో పాటు ఇతర పీహెచ్‌సీల్లో అరకొర వసతుల కారణంగా.. అనారోగ్యం బారిన పడిన వారు ప్రాణాలు కోల్పోతున్నా.. ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. అపరిశుభ్రత, కలుషిత నీరు, దోమల వల్ల ప్రజలు నిత్యం అనారోగ్యానికి గురవుతున్నా వైసీపీ ప్రభుత్వ ప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సీఎం, ఎమ్మెల్యే శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేశారని రూపాయి పనిమాత్రం చేసింది లేదని ఎద్దేవా చేశారు.

బుగ్గవంకపై బ్రిడ్జిలు ఎప్పుడు నిర్మిస్తారు?

నగర ప్రజలకు రవాణా సౌకర్యం అంతంతే అన్నారు. బుగ్గవంకపై షహమీరియా దర్గా వద్ద.. రవీంద్రనగర్‌లో లా కాలేజీ వెళ్లే దారిలో గతంలో ఉన్న రెండు బ్రిడ్జిలు తొలగించారన్నారు. దాని వల్ల ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిపై తిరిగి బ్రిడ్జిలు నిర్మిస్తామని ఎమ్మెల్యే మాట ఇచ్చారే కానీ.. ఇంతవరకు పనులు ప్రారంభించింది లేదన్నారు. పాలెంపల్లె, వైఎస్సార్ నగర్, హోమియోపతి కాలేజీ వద్ద గాంధీనగర్ స్కూలు నుంచి ప్రకాశనగర్ వెళ్లే రోడ్లతో పాటు నగరంలోని ప్రతి రోడ్డు అధ్వాన్నంగా ఉందన్నారు. దీంతో గర్భిణీలు, వాహనదారులు రోగులు పడుతున్న ఇబ్బందులు వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రిమ్స్ నుంచి సబ్‌జైలు కూడలికి రావాలంటే సరైన రవాణా వ్యవస్థ లేదన్నారు. ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం హోదాలో ప్రజలకు కనీసం ఒక్క బస్సు కూడా వేయలేదని ఆరోపించారు.

వీధి వ్యాపారుల నుంచి మామూళ్లు

పదేళ్ల ఎమ్మెల్యే పాలనలో కడప నగరంలోని వీధి వ్యాపారులు దగా పడ్డారన్నారు. నెలనెలా మామూళ్ల పేరుతో వసూళ్లకు పాల్పడుతూ వారిపై దాడులు చేస్తున్నారన్నారు. వీధి వ్యాపారులను ప్రోత్సహించాల్సింది పోయి వారి మీద వసూళ్ల పేరుతో దాడులు చేయడం తగదన్నారు.

యువతను మత్తులో ముంచుతున్నారు

కడప నగరమంటే ఒక బ్రాండ్.. ఆ బ్రాండ్ నేమ్ దెబ్బతీస్తూ పది సంవత్సరాలుగా ఎమ్మెల్యే మాఫియా నడిపిస్తున్నారని అన్నారు. యువతను ఉద్యోగాల ఊసే ఎత్తకుండా మత్తులో ముంచుతున్నారన్నారు. డ్రగ్స్, గంజాయిలాంటివి తెచ్చి కడపలో విక్రయిస్తున్నారని... ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే ఈ దందా నడుస్తుందా అని ప్రశ్నించారు.

ముస్లింలకూ మొండిచేయి

కడప ఎమ్మెల్యే మైనార్టీలకు కూడా మొండిచేయి చూపారన్నారు. కోట్ల విలువ చేసే మోచంపేటలోని హజ్రత్ రబీబ్‌షా వల్లి దర్గా భూమిని వైసీపీ రాష్ట్ర నాయకుడు బావమ్మర్దికి ధారాదత్తం చేశారన్నారు. దాన్ని అడ్డుకున్న ముస్లిం పెద్దలను అరెస్టు చేయించి జైల్లో పెట్టించారన్నారు. దర్గా భూములు, వక్ఫ్‌బోర్డు భూములు దొంగల పాలవుతుంటే చూస్తూ ఆనందిస్తున్నారు తప్ప దాన్ని అడ్డుకోలేదన్నారు. పేదరికంలో మగ్గుతున్న ముస్లిం కుటుంబాలకు ఎలాంటి సాయం చేయలేదన్నారు. ముస్లిం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎలాంటి తోడ్పాటు కల్పించలేదన్నారు. వరుసగా రెండుసార్లు ఆయనను గెలిపించి ప్రజలు మోసపోయారని.. ఈ సారైనా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ, ఎండీహెచ్ షేక్ మహ్మద్ బాషా, బీజేపీ నేతలు లక్ష్మణరావు, పద్మాభాయి, అంబిక, చలపతి, జనసేన నాయకులు తుంగా రమణయ్య, మాలేశివ తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు



శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడండి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 8: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కడప నగరంలో శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని సంఘసేవకుడు సలావుద్దీన్ ఆర్డీఓకు విన్నవించారు. సోమవారం కడప కమ్యూనిటీ లీడర్స్ ఆధ్వర్యంలో ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఈనెల 6న రాత్రి షబే ఖద్ర్ రోజున కొందరు ముస్లిం యువకులపై నగర టూటౌన్ ఎస్ఐ విచక్షణారహితంగా లాఠీతో కొట్టి వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. దీనివల్ల కడపలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే పరిస్థితి రాకుండా చూడాలన్నారు.

కడప నగర దాహార్తిని విస్మరించిన డిప్యూటీ సీఎం

● టీడీపీ నేతలు శ్రీనివాసరెడ్డి, భూపేష్‌రెడ్డి, మాధవీరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8:కడప నగరం పదేళ్లుగా వైసీపీ పాలనలో ఉన్నప్పటికీ శాశ్వత తాగునీటి పథకాన్ని అందించలేకపోయారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి అన్నారు. సోమవారం కడప నగరం ప్రజలకు తాగునీరు అందించే లింగంపల్లె వాటర్ వర్క్స్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో మైలవరం నుంచి 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని చెప్పిన అధికారులు ఏప్రిల్ నెల వచ్చినా ఇంత వరకు పెన్నానదిలో నీరు కనిపించలేదన్నారు. ఇదంతా కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకేనన్నారు. 2017లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు కడప ప్రజలకు శాశ్వత తాగునీటి థకాన్ని అందించేందుకు రూ.70 కోట్లు మంజూరు చేశారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కార్పొరేషన్ భాగస్వామ్యంతో నిర్మించాలని నిర్ణయించి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అయితే ఆ పనులు ఇంతవరకు పూర్తికాలేదన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు గోవర్ధనరెడ్డి, శివకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి: పుత్తా



సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 8: రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపించాలంటే టీడీపీని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమ వారం మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామం లో పుత్తా నరసింహారెడ్డి ఆర్యవైశ్య సంఘం స భ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సోమవారం ఆర్యవైశ్యుల సంఘం ఆహ్వానం మేరకు పుత్తా నరసింహారెడ్డి పెద్దచెప్పలి గ్రామంలో పర్యటించారు. ముందుగా అమ్మవారిశాలలో అ మ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సభలో ఆయ న మాట్లాడారు. టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, కంకర సు బ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, దివాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లేశ్‌రాయల్, దాదిరామయ్య, చిన్నసుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో క్విజ్ పోటీలు

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 8 : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల (రిమ్స్)లో ఐఏపీఎస్ఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

బాబుతోనే భవిష్యత్తు: పుత్తా చైతన్య



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి

చెన్నూరు, ఏప్రిల్ 8 : చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని టీడీపీ కమలాపురం అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం చెన్నూరులో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ విస్తృత ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. అందుకే చంద్రబాబును సీఎం చేసుకోవాలని ప్రజలను కోరారు.

ఇఫ్తార్ పుణ్యకార్యం

చెన్నూరు తూర్పువీధిలో జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, నియోజకవర్గ నేత ఖాజాహుసేన్, కోఆప్షన్ సభ్యుడుగౌస్‌పీర్ ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హాజరయ్యారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 8: ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబునాయుడితోనే సాధ్యమని పుత్తా కుటుంబ సభ్యులు అన్నారు. సోమవారం మండలంలోని నాగాయపల్లె, తుమ్మలూరు పంచాయతీలలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కుమార్తె దివ్యశ్రీ, కోడలు శ్రీచైతన్య, తమ్ముని కుమారుడు సాయి నరసింహారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేసుకోండి: సీఐ

కడప (క్రైం), ఏప్రిల్ 8 :వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వే చ్ఛగా ప్రశాంత వాతావరణంలో ఓటు వేసు కోవచ్చని చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు భరోసా కల్పిస్తూ కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సోమవారం కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. దేవునికడప, పాతకడప, ఎస్‌సీ కాలనీ, మోడమీదపల్లె రహదారుల గుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలకు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోట గంగమ్మ ఆలయ వార్షికోత్సవం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 8 : స్థానిక కోట గంగమ్మ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కడప 'లయన్స్'కు 9 అవార్డులు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 8 : లయన్స్ క్లబ్ సభ్యులకు 9 అవార్డులు లభించాయి. 2022-23 సంవత్సరానికి గాను సంస్థలో సభ్యత్వాన్ని పెంచడం ప్రజలకు అవసరమైన సేవలందించడం మానవ సంబంధాలు చక్కగా నిర్వహించడం తదితర అంశాల్లో ఈ అవార్డులు లభించాయి. దాదాపు సంవత్సరం పాటు సంస్థ అధినేతలు ఈ అంశాలపై సరైన వ్యక్తులెవరో ఎంపిక చేసుకుంటారు. అవార్డుల ప్రదానానికి వారం రోజుల ముందు సభ్యులకు ఈ విషయం తెలియజేస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు లయన్స్‌క్లబ్ విభాగం డిస్ట్రిక్ట్ గవర్నరు రామచంద్ర ప్రకాశరావు ప్రొద్దుటూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరికి అవార్డులు అందించారు. లయన్స్ క్లబ్ నుంచి పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నరు కె.చిన్నపరెడ్డి కె.విజయలక్ష్మి, కె.సంజీవరెడ్డి, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, జోన్ చైర్మన్ డాక్టర్ రంగనాదరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు, ఉపాధ్యక్షులు గౌరీశంకర్, సహాయ కార్యదర్శి కొండయ్య, సభ్యులు కోటా సత్యనారాయణ, సుశీల్‌కు ఈ అవార్డులు అందించారు.

ఎంపీడీఓ చొరవతో బోర్లకు మోక్షం

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 8: ఎంపీడీఓ పులి రామ్‌సింగ్ చొరవతో మండల పరిధిలోని తలపనూరు గ్రామంలోని ఎస్సీ, ఓసీ కాలనీలు, కోమటి గ్రామంలోని రెం డు చేతిపంపు బోర్లకు మరమ్మతులు చేపట్టారు. గత ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉండి పనికిరాకుండా మూలనపడిన చేతిపంపు బోర్లు వినియోగంలోకి వచ్చాయి. సొంత ఖర్చులతో మెకానిక్‌ను రప్పించి బోర్లకు మరమ్మతులు చేయించి నీటి సమస్య లేకుండా చేశారు. ఎండాకలంలో నీటి సమస్యను తీర్చడంతో ప్రజలు ఆయన్ను అభినందించారు.

దోసకు దోమ పోటు



దోమ పోటుతో పగిలిన దోస కాయలు



గిడసబారిన కాయలు

- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఎన్ని మందులు పిచికారి చేసినా.. అదుపులోకి రాని వైనం
- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- ఆందోళనలో అన్నదాతలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 8: ఆరుగాలం కష్టించే రైతన్నలకు కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. ప్రతి ఏడాది ఎన్నో ఆశలతో పంటలు సాగు చేయడం తీరా పంట చేతికి వచ్చే లోపు నష్టపోవడం షరా మామూలైపోయింది. ప్రకృతి వైపరిత్యాలు, చీడ పీడలు ఆశించడం, తెగుళ్ల సోకడం.. అన్నింటిని అధిగమించి దిగుబడి బాగా వస్తే.. ధరలు లేక పోవడం ఇలా ఏదోక రూపంలో నష్టపోతూనే వున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం దోస పంట సాగు చేసిన రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు, ఓబుల వారిపల్లె మండలాల్లో ఈ ఏడాది డిసెంబరు, జనవరి నెలలో సుమారు 5 వేల ఎకరాల్లో దోస పంటను రైతులు సాగు చేశారు. గ్రీన్ మిలాన్, కుందన్, కోహినూర్ అనే రకాల దోస రకాలను రైతులు సాగు చేశారు. పంట సాగుకు ఎరువులు, కూలీలు, కలుపులు, మందుల పిచికారికి ఎకరాకు దాదాపు రూ.లక్ష ఖర్చు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. పంట కూడా ఆశాజనకంగా ఉండటం.. మార్కెట్లో దోస కాయలకు మంచి డిమాండ్ (టన్ను రూ. 16 వేల నుంచి రూ. 17వేలు ధర) ఉండటంతో రైతులు తమ కష్టాలు తీరుతాయని ఎంతో ఆశించారు.

ఆశలపై నీళ్లు చల్లుతూ..

పంట దిగబడి వచ్చే సమయంలో రైతన్నల ఆశలపై నీళ్ల చల్లుతూ.. దోస పంట దోమ పోటుకు గురైంది. దీంతో రైతులు పంటను కాపాడుకునేందుకు ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. ఉద్యానశాఖాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని మందులు పిచికారి చేశారు. అయినా అదుపులోకి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దోమ పోటు కారణంగా కాయలు పగిలిపోవడం, తీగ అభివృద్ధి చెందకుండా పోయింది. కాయలు కూడా గిడసబారిపోయాయి. దీంతో ఎకరాకు 10 టన్నుల పైగా దిగుబడి రావాల్సి ఉండగా.. 2 నుంచి 3 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో ఎకరాకు రూ.50 వేలు నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి దోస కాయలను ముంబాయ్, ఢిల్లీ, రాజస్థాన్, నాగపూర్, భూపాల్, పంజాబ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర నగరాలకు రైతులు ఎగుమతి చేస్తున్నారు. దోమపోటు గురైన కాయలను ఎవరు తీసుకోకపోవడంతో రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు.



దోమ పోటుతో దెబ్బతిన్న దోస పంట

పెట్టుబడి కూడా రాలేదు



దోస పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టి నాలుగు ఎకారాల్లో పంట సాగు చేశాను. పంట బాగుంది కష్టాలు తీరుతాయనే సమయంలో దోమపోటు సోకింది. ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పినట్లు మందులు పిచికారి చేశాను. అయితే తిప్స్ దోమలు కంట్రోల్ కాలేదు. దిగుబడి బాగా తగ్గిపోయి పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

జి.వెంకటసుబ్బయ్య, రైతు, సింగిరివారిపల్లె, రైల్వేకోడూరు మండలం

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుర్రప్ప, జాన్ కెనడీ ఎన్నిక



ఎన్నికల్లో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులు

కడప (రూరల్) ఏప్రిల్ 8: కడప న్యాయవాదుల సంఘం 2024-25 పాలకవర్గ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 575 మంది న్యాయవాదులు పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా బి.గుర్రప్ప, ప్రధాన కార్యదర్శిగా జాన్‌కెనడీ గెలుపొందారు. అధ్యక్ష స్థానానికి జి.వి.రాఘవరెడ్డి బి.గుర్రప్పలు పోటీ పడగా గుర్రప్ప 16 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవికి జాన్‌కెనడీ, చంద్రవదనలు పోటీచేయగా వీరిలో జాన్‌కెనడీ 54 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సంయుక్త కార్యదర్శి(స్పోర్ట్స్, కల్చరల్) స్థానానికి ఎస్.చిన్నయ్య, జె.విజయకుమార్‌లు పోటీ పడగా వీరిలో ఎస్.చిన్నయ్య 70 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక ఉపాధ్యక్ష స్థానానికి పి.చంద్ర మోహన్, కార్యదర్శి-1 స్థానానికి ఎ. రవీంద్రనాద్ రెడ్డి, కోశాధికారి స్థానానికి ఎంవీ సుబ్బరామయ్య, లైబ్రరీ సెక్రటరీ స్థానానికి పి. నాగభూషణంలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి(సీనియర్ న్యాయవాది) పి.జయరామిరెడ్డి తెలిపారు. నూతనంగా ఎంపికైన బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.గుర్రప్ప జాన్‌కెనడీ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి శ్రమిస్తామన్నారు.

చిన్నపిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప(రూరల్) ఏప్రిల్ 8: దుకాణాలు, కర్మాగారాలు తదితర ఇతర ప్రదేశాలలో చిన్న పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ ఎస్.కవిత పేర్కొన్నారు. సోమవారం నిర్బంధిత బాలకార్మికుల రక్షణ, పునరావాస కార్యక్రమాలకు సబంధించి సోమవారం నగరంలోని ఆర్కేఎం స్ట్రీట్, మద్రాస్ రోడ్లలో ఉన్న షాపులలో లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కవిత మాట్లాడుతూ షాపులలో చిన్నపిల్లలతో పనులు చేయించకూడదన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని షాపులలో పనిచేయించుకోవాలన్నారు. ఉచిత న్యాయసహాయం తదితర అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. మనోహర్, లెబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.పాల్ జాన్సన్, ఎస్.ఐ నిర్మలాదేవీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైలు గడువు పొడిగింపు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8: కడపమీదుగా రాజస్తాన్‌లోని భగత్‌కీకోటి రైల్వే స్టేషన్ వెళ్లే ప్రత్యేక రైలు గడువును మే 1వతేదీ వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. భగత్‌కీకోటి రైల్వేస్టేషన్ నుంచి ఈ నెల 18, 27 తేదీల్లో రైలు (04811) బయల్దేరి ఎర్రగుంట్ల, కడప మీదుగా కోయంబత్తూరుకు వెళ్లనుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో కోయంబత్తూరు నుంచి రైలు (04812) ఈ నెల 22, మే 1 తేదీల్లో బయల్దేరి రాజస్తాన్‌లోని భగత్‌కీకోటికి వెళ్లనుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12న పులివెందులలో షర్మిల బస్సుయాత్ర

వేంపల్లె, ఏప్రిల్ 8: పీసీసీ అధ్యక్షురాలు, ఆ పార్టీ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల 12వ తేదీన పులివెందులలో బస్సుయాత్ర నిర్వహించనున్నారని పీసీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం 10:30 గంటలకు వేంపల్లె నుంచి బస్సుయాత్ర ప్రారంభమై వేముల మీదుగా పులివెందులకు మధ్యాహ్నం చేరుకుంటుందన్నారు. భోజనం అనంతరం లింగాలకు అక్కడి నుంచి వెలిదండ్ల, బిదినంచెర్ల మీదుగా సింహాద్రిపురానికి సాయంత్రం పులివెందులకు చేరుకుంటుందని వివరించారు.

సంస్కృతికి ప్రతిరూపం రాష్ట్రగీతం

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8: శంకరంబాడి సుందరాచారి రాసిన మన రాష్ట్ర గీతం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ', మన సంస్కృతీ సాంప్రదాయాలకు నిలువెత్తు రూపమని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసరు మూలమల్లిఖార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శంకరంబాడీ సుందరాచారి 47వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాఠశాల వేళలు మార్చాలి : ఎస్టీయూ

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8 : విద్యార్థులకు ఎండల తీవ్రత ఎక్కువ ఉండడం వల్ల పాఠశాలల సమయం మార్పు చేయాలని ఎస్టీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు కోరారు. సోమవారం కడప నగరం ఎస్టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. చాలా చోట్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల సమయం ఉదయం 7 నుంచి 11.30 వరకు మార్పు చేయాలన్నారు.

గొలుసు దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు



వివరాలు తెలుపుతున్న చిన్నచౌకు సీఐ, ఎస్ఐ

కడప (క్రైం), ఏప్రిల్ 8: చిన్నచౌకు పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో ఓ మహిళ మెడలో నుంచి బంగారుగొలుసు లాక్కుని పారిపోయిన కేసులో నిందితుని అరెస్టు చేసి బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం చిన్నచౌకు సీఐ, ఎస్ఐలు సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నగరంలోని భరత్‌నగర్‌కు చెందిన మోడుగుల చంద్రమౌళి అనే వ్యక్తి ఓ ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. అయితే డబ్బులు సరిపోకపోవడంతో ఈజీ మనీ కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో శ్రీరామ్‌నగర్‌లోని ఓ ఇంటి ముందు కసువు ఊడుస్తున్న మహిళ మెడలో నుంచి 35 గ్రాములు గల బంగారు సరుడును లాక్కుని పరారీ అయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పాత బైపాస్‌రోడ్డులో బ్రహ్మయ్యమెడ్డు వద్ద ముద్దాయి ఉన్నట్లు సమాచారం రావడంతో సీఐ, ఎస్ఐలు సిబ్బందితో వెళ్లి అతన్ని అరెస్టు చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



మల్లయ్య మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 8: స్థానిక పవర్‌హౌస్ రోడ్డుకు చెందిన మల్లయ్య అలియాస్ మల్లి (34) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు ... మల్లయ్య మిట్టమడివీధిలో బాడుగ ఇంట్లో భార్య ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో భార్య దొరసానిపల్లెలోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మల్లయ్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని పవర్‌హౌస్‌రోడ్డులోని సొంత ఇంటికి వచ్చి ఉండేవారు. తన అక్కను ఎందుకు కొట్టావంటూ మల్లయ్య ఇంటికి వెళ్లి అతనితో గొడవకు దిగారు. దీంతో మనస్థాపం చెందిన మల్లయ్య తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి





ప్రమాదంలో దెబ్బతిన్న పాలవ్యాను, మృతి చెందిన అన్నమయ్య (ఫైల్)

సంబేపల్లె, ఏప్రిల్ 8: మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి నారా యణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడు ప్రమాదంలో కందుకూరి అన్నమయ్య (20) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లెకు చెందిన అన్నమయ్య అతని తండ్రి రామకృష్ణ గ్రామంలో పాలు సేకరించుకొని ప్రతి రోజు కలకడ దగ్గర ఉన్న జెర్సీ పాల డైరీకి పాలు తరలించే వారు. ఈ క్రమంలో ఆదివారం పాలు తీసుకొని డైరీకి తీసుకెళ్లి తిరుగు ప్రయాణంలో నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు వద్దకు రాగానే ముందువైపు ఉన్న లారీని ఢీకొనడంతో అన్నమయ్య మృతి చెందాడు. అతని తండ్రి రామకృష్ణ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి భయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకు అదుపు తప్పి యువకుడు మృతి



ప్రమాద స్థలంలో సరేష్ మృతదేహం

ముద్దనూరు ఏప్రిల్ 8: మండల పరిధి పులివెందుల రహదారిలోని నల్లబల్లె గ్రామం పుల్లేరు వంక సమీపంలో సోమవారం బైకు ప్రమాదంలో సురేష్(25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... నంద్యాల జిల్లా సంజామల మండలం రామిరెడ్డిపల్లెకు సురేష్ పులివెందులలోని హిందూ ట్రావెల్స్ పనిచేస్తున్నాడు. పులివెందుల నుంచి స్వగ్రామానికి బైకులో వెళుతూ బైకు అదుపు తప్పి పొలంలో పాతిన దిమ్మెకు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ శ్రీనివాసులు సంఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదస్థలాన్ని పరిశీలించారు.

వాహనాల తనిఖీలో లక్ష రూపాయలు సీజ్

పుల్లంపేట, ఏప్రిల్ 8: మండల పరిధిలోని పుత్తనవారిపల్లె చెక్‌పోస్టు వద్ద సోమవారం చేపట్టిన వాహనాల తనిఖీలో లక్ష రూపాయల నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. ఓబులవారిపల్లె మండలం అయ్యలరాజుపల్లెకు చెందిన సూర్య ప్రకాష్‌రెడ్డి మోటారు బైకుపై లక్ష రూపాయలు తీసుకెళుతుండగా.. ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడం సురక్షితం



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 8 : ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడం పూర్తిగా సురక్షితమైన మార్గమని, ఎటువంటి మానసిక ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు 24/7 గంటలు 365 రోజుల్లో ఎప్పుడైనా ఎక్కడి నుంచి అయినా సెలవు దినాల్లో అయినా ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. సోమవారం ఆయన విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రానికి వెళ్లి అక్కడ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు విద్యుత్ వసూలు కేంద్రాల వద్దకు వెళ్లి క్యూలో నిలబడాల్సిన అవసరం లేదన్నారు. ఎటువంటి వయ ప్రయాసలకు గురికాకుండా.. మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా సురక్షిత ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మొబైల్‌ఫోను నుండే బిల్లులు చెల్లించుకునే సౌలభ్యం ఉందన్నారు. దాదాపు 80 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో చెల్లించిన బిల్లులకు రశీదులు పొందవచ్చని, అంతేకాకుండా గతంలో మనం చెల్లించిన బిల్లుల రశీదుల వివరాలు కూడా చూసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే రశీదు, కార్యాలయం వద్ద చేతితో ఇచ్చే రశీదు రెండూ సమానమేనని.. అందులో సందేహం లేదన్నారు. ఏమైనా అపోహలు ఉంటే దగ్గరలోని విద్యుత్ రెవెన్యూ ఆఫీసుల వద్దకు వెళ్లి సందేహాలు నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అలాగే మీ విద్యుత్ సర్వీసులకు మీ మొబైల్ నెంబరును తప్పనిసరిగా లింకు చేసుకుంటే సమాచారం మీకు అందుతుందన్నారు.

నిందితులను తప్పిస్తే సహించేది లేదు : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 8: భూ వివాదంతో హత్యకు గురైన ఆదిమూలం శ్రీనివాసులు హత్య కేసులో ప్రధాన నిందితులైన చిన్నపుల్లారెడ్డి, నాగ పుల్లారెడ్డిని తప్పించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కా ర్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు హెచ్చరించారు. వారి తో పాటు సంబంధిత మండలం ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, అప్పటి తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజును కూడా నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం చిన్న సుబ్బరాయుడుకు చెందిన భూమి విషయమై వివాదం నడుస్తోందన్నారు. ఆ సమస్యను పరిష్కరించాలని చాలా ఏళ్లుగా ఇటు రెవెన్యూ, అటు పోలీసు అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేదన్నారు. భూ వివాదాన్ని పరిష్క రించాలన్నారు. చిన్నపుల్లారెడ్డి, నాగ పుల్లారెడ్డి వారి కుటుంబ సభ్యులు, అనుచరుల వల్ల ప్రాణహాని ఉందని, దీంతో చిన్నసుబ్బరాయుడు కలెక్టర్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందికపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారని, అలాగే చిన్నపుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డిలను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో చెప్పాలన్నారు. సమావేశంలో సీపీఐ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర, కడప నగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శి బాదుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నాయకులు చంద్రశేఖర్, గంగాసురేష్, వలరాజు, భాగ్యలక్ష్మి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సామాన్యులకు రక్షణ లేదు : బీజేపీ



మాట్లాడుతున్న బాలకృష్ణయాదవ్

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 8: వైసీపీ పాలనలో సామాన్యులకు రక్షణే లేకుం డా పోయిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. సో మవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఈనెల 2వ తేదీన పెండ్లిమర్రి మండలం యాదవాపురం గ్రామానికి చెం దిన ఆదిమూలం శ్రీనివాసులు అనే యువకుడిని ఆయన సొంత భూమిలో పనిచేసుకుం టూ ఉండగా అదే గ్రామానికే చెందిన పెద్దిరెడ్డిగారి చిన్న పుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డి అనుచరులు హత్య చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై సంబంధిత మం డల ఎస్ఐ, అలాగే అప్పటి తహసీల్దార్‌ను కూడా నిందితులుగా చేర్చి శిక్ష పడేలా చేయాలన్నారు. లేదంటే ఈ హత్యను ఢిల్లీ స్థాయికి తీసుకెళతామని హెచ్చ రించారు. ఈ సమావేశంలో హత్యకు గురైన శ్రీనివాసులు తండ్రి చిన్నసుబ్బరాయుడు, అఖిల భా రత యాదవ మహా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గంగాదేవి గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

ముద్దనూరు ఏప్రిల్ 8: భూపేశ్‌రెడ్డిని ఎంపీగా గెలిపించేందుకు జమ్మలమడుగు నియోజకవర్గంలో భారీ మెజారిటీ వచ్చేలా ఎన్డీయే కూటమి నాయకులు, కార్యర్తలు కృషి చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక ఉమ్మశెట్టి ఫంక్షన్ హాలులోసోమవారం టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి ప్రసంగించారు. దేవగుడి కుటుంబంలో తాను, భూపేశ్ పోటీలో ఉన్నామని, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజార్టీ ఓట్లు సాధించేలా కృషి చేయాలన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే గండికోట నిర్వాసితులకు అదనంగా మరో రెండు లక్షలు కలిపి రూ.12 లక్షలు ఇప్పిస్తామన్నారు. కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నిల్లో ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరుపున తాను పోటీలో ఉన్నానని, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ తరుపున ఆదినారాయణరెడ్డి పోటీలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు చింతాశివరామిరెడ్డి, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ఖాదర్ ఖాన్, బాబాఅమీర్, రామాంజనేయరెడ్డి(బాబు), కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, శేఖర్‌నాయుడు,రామసుబ్బారెడ్డి,బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి,అప్పర్ణ, గోపాలకృష్ణ,తులశయ్య టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు , నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో ఉత్సవాలు

కడప (కల్చరల్) ఏప్రిల్ 8: ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురష్కరించుకుని నగర రిమ్స్ సమీప శిల్పారామంలో ఈనెల 9, 11, 17, తేదీలలో సంప్రదాయ ఉత్సవాల కార్యక్రమం తలపెట్టినట్లు సంబంధిత పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు 9వ తేదీ మంగళవారం సాయంత్ర ం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జానపద, సినీ, కూచిపూడి, నృత్యాలు వుంటాయన్నారు. ఈనెల 11న రంజాన్, 17న శ్రీరామనవమి రోజు కూడా సాయంత్రం 6 నుంచి 8 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పలువురిని కలిసిన డాక్టర్ వైఎస్ సునీత

పులివెందుల, ఏప్రిల్ 8: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత సోమవారం పలువురిని కలిశారు. మదూరుకు చెందిన ప్రతాప్‌రెడ్డి కుమారుడు ఎం.వినయ్‌రెడ్డిని, రమణారెడ్డి కుమారుడైన మురళీధర్‌రెడ్డిని, ఖాజీపేటకు చెందిన గోవిందరెడ్డిని, డీఎల్ రవీంద్రారెడ్డిని, రాజుపాలెంకు చెందిన వెంకటరామిరెడ్డిని సునీత కలిసి మాట్లాడారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఆరా తీయగా వారితో మాట్లాడినట్లు ఆమె ధృవీకరించారు.

వైసీపీకి అఫ్జల్‌ఖాన్ రాజీనామా

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 8 : వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి వైసీపీ సీనియర్‌నాయకులు టీకే అఫ్జల్‌ఖాన్ సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా పంపించారు. కడప ఎమ్మెల్యే సీటు ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని.. ఈనేపధ్యంలో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో స్పష్టం చేసినట్లు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 8: అక్కలరెడ్డి పల్లెలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. ట్రాక్టర్ల చిన్నదస్తగిరి అనే రైతు పశువుల కోసం వేసుకున్న గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో కాలిపోయి బూడిదగా మారింది. దాదాపు రూ.40వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

తాగు నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

మైదుకూరు, ఏప్రిల్ 8 : తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు, ఎమ్మెల్యే గాని ఏ మాత్రం పట్టించుకోలేదంటూ మహిళలు ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై సోమవారం పట్టణంలోని పాశెం రోడ్డు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులకు పలు మార్లు చెప్పినా ఏమాత్రం పట్టించుకో లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మైదుకూరు కడప జాతీయ రహదారిపై బైఠాయించారు. కాగా ట్యాంకర్లతో నీటిని పంపుతామని మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆరాధన మహోత్సవాలకు సర్వం సిద్ధం

బ్రహ్మంగారిమఠం,ఏప్రిల్ 8: సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్స వాలకు సర్వం సిద్ధం చేసినట్లు ప్రస్తుత మఠాధిపతులు రామక్రిష్ణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు వసతి, మంచినీరు, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 9,10వ తేదీల్లో ఆరాధన మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. 9న ఉదయం పూల పూజ, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. ఆలయ ప్రాంగణంలోని యాదవ అన్నసత్రంలో అన్నదానం చేపడతామన్నారు. రాత్రి 10గంటలకు చింతామణి నాటకం నిర్వహిస్తామన్నారు. 10వతేదీ ఉదయం 6గంటల నుంచి చిన్నబండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి పెద్దబండ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వరద సమక్షంలో భారీ చేరికలు



వరద సమక్షంలో పార్టీలో చేరిన నారపురెడ్డి తదితరులు

రాజుపాలెం, ఏప్రిల్ 8 : మండల పరిధిలోని కుమ్మరపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు జీరెడ్డి నారపురెడ్డి, జీరెడ్డి శివశంకర్‌రెడ్డి, జీరెడ్డిశేఖర్‌రెడ్డి, సీతారామిరెడ్డి పలువురు సోమవారం ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మానికింది ఖాదర్‌బాషా, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కొరపాటి సుధాకర్‌రెడ్డి, అర్కటవేముల క్రిష్టారెడ్డి, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 8: జమ్మలమడుగు నియోజకవర్గంలో కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో సార్వత్రిక ఎన్నికల్లో ముందుకెళ్లాలని టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో జమ్మలమడుగు మున్సిపాలిటీ, మైలవరం మండలాల కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని గెలిపించాలనిఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచమల్లు కక్ష రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెబుతారు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 8 : వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కక్ష పూరిత రాజకీయాలకు ప్రొద్దుటూరు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పే సమయం వచ్చిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం 27 వవార్డు వసంతపేటలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య ఆధ్వర్యంలో వరదరాజుల రెడ్డి ఎన్నికల ప్రచారానికి టీడీపీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. వరదరాజులరెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, వీఎస్ ముక్తియార్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఖలీల్, జనసేన నాయకులు జిలాన్‌బాషా, సుంకర మురళి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగా శివకల్యాణి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు రాఘవేంద్రరెడ్డి, బోగాల లక్ష్మీనారాయణమ్మ, చౌటపల్లె మార్తల లక్ష్మీరెడ్డి, బద్వేలు శ్రీనివాసులరెడ్డి,తలారి రమేష్ తలారి ఓబులేసు, తలారి మత్తేసు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అరాచకపాలనను అంతం చేద్దాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

ఖాజీపేట, ఏప్రిల్ 8: రాష్ట్రంలో వైసీపీ పాలనను అంతమొందించేందుకు ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధం కావాలని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలో తవ్వా ఓబుళరెడ్డి , మల్లేష్, పెద్దగంగన్న, గంగాధర్‌నాయుడు అనుచర వర్గం పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మల్హోత్ర, బీజేపీ ఇన్‌చార్జి సుబ్బరాయుడు, బాలకొండారెడ్డి, గోవిందురెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి, చంద్రభాస్కర్‌రెడ్డి, గౌస్, రమణ, నరసింహులు, పిచ్చినాయుడు, రామానాయుడు, గోవిందు సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రూ.4 వేలు పింఛన్

ఖాజీపేట, ఏప్రిల్ 8: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని భూమాయపల్లె పంచాయతీ పరిధిలో ముత్తులూరుపాడు, మూలవారిపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్హోత్ర, బీజేపీ ఇన్‌చార్జి సుబ్బరాయుడు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, చంద్రమోహన్, శేఖర్, నరసింహులు, బాలనాగేష్, చెట్టుకిందవెంకటేష్ బ్రదర్స్ గోవిందురెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోవిందు సుబ్బయ్య, వీరయ్య, ప్రతాప్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, హరినాథరెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం



ప్రచారం నిర్వహిస్తున్న రోశన్న

కాశినాయన ఏప్రిల్ 8: వైసీపీ పాలనలో అభివృద్ధి మచ్చుకైనా కనబడలేదని బద్వేల్ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జా రోశన్న పేర్కొన్నారు. సోమవారం బసనపల్లెలో బీజేపీ టీడీపీ,జనసేన నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి బీజేపీ కమలం గుర్తుపై ఓటెయ్యాలని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, రాజారెడ్డి, రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు ఎల్. శ్రీనివాసులరెడ్డి, నర్శిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, కే.దుగ్గిరెడ్డి, పి.పోలిరెడ్డి,హోండా రవీంద్రారెడ్డి,ఓ.రోహిత్‌రెడ్డి,బి.నరసింహారెడ్డి, సర్పంచ్ ఖాజావలి,,అక్కి రమణారెడ్డి, నాగిరెడ్డి, మనోహర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 8: జమ్మలమడుగులోని పలగాడివీధి, గౌసియా షాదీఖానా, గౌసియా మకాన్‌లో సోమవారం రాత్రి రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎన్డీయే కూటమి, ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, బీజేపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితర నేతలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం వారు గౌసియా మకాన్‌లో పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ, తాహీర్‌పీరాఖాద్రి స్వామి వారితో దర్గాలో ఆశీర్వాదం తీసుకున్నారు. జనసేన నాయకులు నాగార్జున, కేకే ఖదీర్, వరప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, గుర్రంప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆశయాలను

జగన్ ఏ ఒక్కటీ నెరవేర్చలేదు

ఏపీసీసీ చీఫ్, కడప పార్లమెంటు అభ్యర్థి వైఎస్ షర్మిల



బి.మఠంలో మాట్లాడుతున్న షర్మిల

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 8: వైఎస్ఆర్ ఆశయాలను జగన్ మోహన్‌రెడ్డి ఏ ఒక్కటీ కూడా నెరవేర్చలేదని ఆయన వైఎస్ఆర్ వారసుడు కానేకాడని ఏపీసీసీ చీఫ్ కడప పార్లమెంటు అభ్యర్థి వైఎస్ షర్మిల పేర్కొన్నారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలిలో బస్సుయాత్రలో భాగంగా బహిరంగసభలో ఆమె మాట్లాడారు. వైఎస్ హయాంలో రైతు రారాజుగా ఉన్నాడని జగన్ హయాంలో రైతులందరూ అప్పులు చేసి ఆత్మహత్యలకు గురవుతున్నారన్నారు. జగన్ పాలనలో హత్యారాజకీయాలు రాజ్యమేలుతున్నాయని, సొంత బాబాయి వైఎస్ వివేకాను కడప ఎంపీ అవినాశ్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి చంపినా నిందితులను కాపాడుతున్నార న్నారు. వివేకా కేసులో నిందితుడుగా ఉన్న అవినాశ్‌రెడ్డికే మళ్లీ కడప ఎంపీ సీటు ఇచ్చారన్నారు. నిందితుడు అవినాశ్‌రెడ్డి చట్టసభల్లోఎలా వెళతారని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించడానికి నేను ఎంపీగా పోటీ చేస్తున్నా న్యాయం కోసం పోరాటం ఒక వైపు, హంతకుల పార్టీ ఒక వైపుఉందని, హంతకులకు ఓటు వేయవద్దన్నారు. అనంతరం వైఎస్ వివేకా కుమార్తె సునీత మాట్లాడుతూ వివేకానుహత్య చేసిందెవరో అందరికీ తెలుసునని, న్యాయం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కడప కాంగ్రెస్ పార్టీ ఎంపీగా వైఎస్ షర్మిల పోటీ చేస్తున్నారని ప్రజలందరూ ఆమెకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీమీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, ధ్రువకుమార్, బ్రహ్మంగారిమఠం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమర్‌నాధరెడ్డి, ఉత్తన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ ప్రాజెక్టూ పూర్తి చేయలేదు జగన్

ఖాజీపేట, ఏప్రిల్ 8: జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టులు మొదలు పెట్టి పూర్తి చేస్తానని చెప్పి మాట తప్పారని ఏపీ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు వైఎస్‌షర్మిల అన్నారు. స్థానిక బస్టాండు కూడలిలో బస్సు యాత్రలో భాగంగా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మీడియా కోఆర్డినేటర్ తులసిరెడ్డి, సునీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.